క్లుప్తంగా

వైభవంగా ఎల్లమ్మతల్లి జాతర


ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ తల్లి

పెనగలూరు : పెనగలూరులోని ఎల్లమ్మ తల్లి జాతర శనివారం వైభవంగా జరిగింది. వేకవజాము నుంచే ఎల్లమ్మ తల్లి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళ ఎల్లమ్మతల్లిని పురవీధుల్లో ఊరేగించినట్లు ఆలయ చైర్మన్ జిలకర సుబ్బయ్య, పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య తెలిపారు. ఆదివారం ఉదయం అమ్మవారికి పొంగళ్లు సమర్పిస్తామని తెలిపారు.

4వ తేదీ నుంచి తిరునాల

లక్కిరెడ్డిపల్లి : ఎల్లమ్మతల్లి తిరునాల ఈ నెల 4, 5వ తేదీల్లో నిర్వహించనున్నట్లు బూడిద గుంటపల్లి గ్రామస్తులు శనివారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రెడ్డప్పగారి రమేష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 4న అమ్మవారికి అభిషేక పూజలు, అలంకరణ, అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 5వ తేది అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారని పేర్కొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత


సుగవాసి ప్రసాద్‌బాబును సన్మానిస్తున్న నిర్వాహకులు

రాయచోటి టౌన్ : ఆధ్యాత్మికత మానసిక ప్రశాంతతకు మార్గమని మాజీ టీటీడీ పాలక మండలి సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. శనివారం రామాపురం మండలం కుమ్మరపల్లె గ్రామంలోని సూరకవాండ్లపల్లెలో ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి వారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓ. వెంకటేష్, మన్నేరు రామాంజనేయులు, పసుపులేటి నాగేంద్ర, మన్నేరు రాజా, మ్నూరు రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న తపస్సు ఘట్టం


మహాభారతంలో కీలక ఘట్టం తపస్సు కార్యక్రమాన్ని వివరిస్తున్న కళాకారుడు

చిన్నమండెం : చిన్నమండెం మండలం మల్లూరు గ్రామంలోని వెలసిన మల్లూరమ్మ తల్లి ఆలయ సమీపంలో జరుగుతున్న మహాభారతయజ్ఞం వైభవంగా సాగుతోంది. ఇందులో భాగంగా శనివారం కీలక ఘట్టమైన తపస్సు ఘట్టం కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రముఖ భాగవతారిణి సీతాలక్ష్మీచే మహాభారతయజ్ఞం వైభవంగా సాగుతోంది. ఈ ఘట్టాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పరామర్శ


కృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డిని పరామర్శించారు. మండల పరిధిలోని బుడుగువారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి ఇటీవల ఆనారోగ్య కారణాలతో చికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న అమరనాథరెడ్డి, కృష్ణారెడ్డి స్వగృహానికి వెళ్లి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాపినేని వేణుగోపాల్‌రెడ్డి, భాస్కర్, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని రామిరెడ్డిగారిపల్లిలో మృతి చెందిన రవికుమార్ మృత దేహానికి నివాళులు అర్పించారు.

మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడికి సతీవియోగం

రాజంపేట టౌన్: రాజంపేట మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు రాముయాదవ్ సతీమణి ఈశ్వరమ్మ (45) శనివారం నారపురెడ్డిపల్లె గ్రామంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, కాకతీయ విద్యా సంస్థల అధినేత వెంకటరమణా రెడ్డి, కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు యోగీశ్వర్‌రెడ్డి, రాముయాదవ్ నివాసానికి వెళ్లి ఈశ్వరమ్మ మృతదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చారు.

సుఖీభవ లేక.. దుఃఖం మింగలేక..!

- సీజన్ ప్రారంభమైనా అందని డబ్బులు
- డోలాయమానంలో అన్నదాత
- సాగుకు అప్పుకోసం రైతన్న వెతుకులాట



రాయచోటి : ఎన్ని నష్టాలు వచ్చినా రైతులు వ్యవసాయాన్ని వదలరు. దేశానికి అన్నం పెట్టేందుకు తన చెమటను ధారపోస్తారు. అలాంటి అన్నదాతలకు పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు, ఎరువుల ధరలు మరింత గుదిబండగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతన్నలకు పెట్టుబడి సాయం అందించేందుకు 'అన్నదాత సుఖీభవ' పథకం పేరుతో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు ఏటా రూ. 20 వేలు పెట్టుబడి సాయం అందచేస్తామని ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు ఊదరగొట్టారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా అన్నదాతలకు నయాపైసా విదల్చలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఖరీఫ్, రబీ రెండు సీజన్లు ముగిశాయి. రెండు సీజన్లకు ఒక్క రూపాయి కూడా విడదల కాకపోవడంతో పంటల పెట్టుబడికి అన్నదాతలు అప్పు తెచ్చుకుని సాగు చేసుకున్నారు. మరో రెండు రోజుల్లో ఖరీఫ్ సీజన్ ఆరంభంకానుంది. ఈ ఏడాది ఖరీఫ్‌కు ముందే రుతుపవనాలు రావడంతో వర్షాలు కూడా ఆరంభమయ్యాయి. ఇక రైతులు కూడా కాడి సిద్ధం చేసుకుని పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. కానీ కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులు విడుదలపై ఇప్పటికీ స్పష్ట ఇవ్వలేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎరువులు విత్తనాలు కొనుగోలుకు చిల్లి గవ్వలేక వడ్డీ వ్యాపారులను రైతులు ఆశ్రయిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నప్పటికీ రైతుభరోసా పథకానికి పేరు మార్చడం మినహా ఎటువంటి పురోగతి కనిపించ లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుల ఖాతాల్లో రూ.13.500 భరోసా వేశారు. అయితే తాము అధికారంలోకి వస్తే రైతులకు ఏటా రూ.20 వేలు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు 'సూపర్ సిక్స్'లో ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 'వైఎస్సార్ రైతు భరోసా' పేరుతో రైతులకు పెట్టుబడి సాయం కింద ఏటా రూ.13,500 వారి ఖాతాల్లో జమ చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న రైతులకు మాత్రం సుఖీభవ దరి చేరలేదు.

ప్రహసనంగా..

కూటమి ప్రభుత్వానికి అన్నదాత సుఖీభవ పథకం ప్రహసనంగా మారింది. కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత హామీని నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారు. జిల్లా పరిధిలోని రాయచోటి, రాజంపేట, కోడూరు డివిజన్ల పరిధిలో 1,44,607 రైతులు ఉన్నారు. వీరందరూ అన్నదాత సుఖీభవ పథకం కోసం ఎదురుచూస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాయచోటి నియోజకవర్గంలో 39,630 రైతులకు రూ. 29.72 కోట్లు, రాజంపేటలో 23,065 మంది రైతులకు రూ. 17.33 కోట్లు రైతు భరోసా ద్వారా డబ్బులు చేరాయి. రైల్వే కోడూరు నియోజకవర్గంలో 27,242 మందికి రూ. 20.44 కోట్ల రూపాయలు రైతులు ఖాతాలో జమ అయ్యాయి.

సాగుకు అప్పులు

మూడు డివిజన్లలో 1,44,607 మంది రైతులు ఉన్నారు. రబీలో టమాటా, బొప్పాయి, వరి, వేరుశనగ ఇతర పంటలు సాగు చేశారు. అయితే ధర లేక నష్టాలపాలయ్యారు. అన్నదాత సుఖీభవ వస్తుందనే నమ్మకంతో అప్పులు చేసి సాగు చేశామని, సీజన్ ముగియడంతో అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి పెంచుతున్నారని రైతులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని నెరవేర్చాలని కోరుతున్నారు. కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకం వర్తించేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేయాలని కోరుతున్నారు. అయితే కౌలు రైతు ధ్రువీకరణ పత్రం (సీసీఆర్‌సీ కార్డు) కలిగి ఉండాలని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి పట్టణం లక్ష్మీపురంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామి వారి మూలవిరాట్‌మూర్తిని పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు పలువురు పాల్గొనగా.. వారికి అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో..

రాయచోటి పట్టణం కొత్తపేటలోని గ్రూప్ థియేటర్స్ వద్ద వెలసియున్న శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో స్వామి వారి మూలవిరాట్ మూర్తులను పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం స్వామి వారికి ఆకుపూజలు, సిందూర పూజలు నిర్వహించారు.

సాఫీగా సాగిన మున్సిపల్ సమావేశం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా

రాయచోటి టౌన్ : రాయచోటి మున్సిపల్ సాధారణ సమావేశం ఎజెండాలు.. ఆమోదాలతో సాఫీగా సాగింది. శనివారం ఉదయం మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇందులో 16 ఎజెండాలతో ప్రారంభించిన సమావేశంలో అన్నింటికి సభ్యులు ఆమోదం తెలిపారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం అందరూ సామరస్యంగా పని చేయాలని మున్సిపల్ చైర్మన్ కోరారు. రూ. కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో తాగునీరు అందడం లేదని సభ్యులు ప్రశ్నలు లేవనెత్తగా దీనిపై అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కొన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులు పూర్తి చేసినప్పటికీ వాటికి సంబంధించిన బిల్లులు ఆమోదం పొందకపోవడంపై సభ్యులు ప్రశ్నించగా.. పెండింగ్‌లో ఉన్న వారి బిల్లులు తమ దృష్టికి తీసుకొస్తే బిల్లుల కోసం సాంకేతికంగా పరిష్కరిస్తామని చెప్పారు.

పాలకొండ్రాయుడికి నివాళి

మాజీ ఎంపీ, ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు మృతిపై సంతాపం తెలిపారు. సభ ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఆయన రాయచోటి ప్రాంతానికి చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ కొన్ని నిమిషాలపాటు మౌనం పాటించారు.

సౌమ్యనాథ స్వామిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్


జిల్లా కలెక్టర్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందలూరు : ఉమ్మడి అన్నమయ్య జిల్లాలో ప్రసిద్ధి గాంచిన శ్రీ సౌమ్యనాథ స్వామిని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ శనివారం దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చరిత్రను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు అనుదీప్ జయసింహ, ఎంపీటీసీ సుభాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు గీతాల నరసింహారెడ్డి, సోమిశెట్టి ప్రభాకర్, పెనుబాల నాగసుబ్బయ్య, కాకి చంద్ర, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి


అనిరుధ్‌రెడ్డి

సంబేపల్లె : పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ జాయింట్ సెక్రటరీ గొర్ల అనిరుధ్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ జాయింట్ సెక్రటరీ గొర్ల అనిరుధ్‌రెడ్డిని పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పదవి కోసం సహకరించిన వైఎస్సాసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఎంపీ మిధున్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

లక్కిరెడ్డిపల్లి : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వింగ్ జాయింట్ సెక్రటరీగా వినయ్ కుమార్ రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా వైఎస్సాసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీ మిధున్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డప్పగారి రమేష్ కుమార్ రెడ్డికి వినయ్ కుమార్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ధూమపానం.. హానికరం


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఓబులవారిపల్లె : సరదాకోసం కాల్చే సిగరెట్ అలవాటుగా మారుతోంది. వ్యసనంగా మారి చివరకు ప్రాణాలనే హరిస్తోందని డాక్టర్ రాజశేఖర్ పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ పొగాకు నివారణ దినోత్సవం సందర్భంగా ముక్కావారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ధూమపానం మానేయడం ద్వారా గుండె జబ్బులు, అధిక రక్తపోటు తదితర ఆరోగ్య సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. పొగాకు వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం



సీఐటీయూ జెండాను ఎగురవేసిన నాయకులు

రాజంపేట : కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ అన్నారు. శనివారం రాజంపేట పురపాలకసంఘం కార్యాలయం వద్ద ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఐటీయూ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 55 సంవత్సరాలు కాలంలో కార్మిక, కర్షక, శ్రామిక వర్గాల కోసం అలుపెరగని పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. కార్మికులకు కనీసం వేతనం రూ.26వేలు అమలు చేయాలని, నాలుగు లేబర్ చట్టాలను రద్దు చేయాలని దేశ వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు పీ వీరమణ, ప్రసాద్, లక్ష్మీదేవి, ఎంవీ రమణ, సాలమ్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజారెడ్డి సేవలు మరువలేనివి


రాజారెడ్డి సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సంబేపల్లె : మండల పరిధిలోని దేవపట్ల జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న రాజారెడ్డి సేవలుమరువలేనివని ఉపాధ్యాయులు శనివారం పేర్కొన్నారు. రాజారెడ్డి పదవీ విరమణ సందర్భంగా ఆయనకు సన్మాన సభను ఏర్పాటు చేశారు. విధుల పట్ల ఆయన చేసిన సేవలను వారు కొనియాడారు. అనంతరం రాజారెడ్డిని సన్మానించారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండండి


సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తున్న సీఐ బాబు

సిద్దవటం : సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా ఫోన్లు చేస్తూ సొమ్ము దోచుకుంటారని అలాంటి వారికి ఓటీపీలు చెప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపారు. శనివారం సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇప్పుడు సోషల్ మీడియా ప్రభావం ఎక్కువ ఉన్నదని, దీనికి రెట్టింపుగా సైబర్ నేరగాళ్ల సంఖ్య కూడా పెరుగుతోందన్నారు. అవగాహనతోనే సైబర్ నేరాలను నివారించవచ్చని తెలిపారు. అలాగే ప్రతి ద్విచక్ర వాహన దారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం ఎస్ఐ మహమ్మద్‌రఫీ, ఏఎస్ఐలు బాబయ్య, సుబ్బరామచంద్ర, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి చౌకదుకాణాల్లో రేషన్ పంపిణీ


డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ దైవాదీనం

సుండుపల్లె : ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఆదివారం నుంచి రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్ దైవాదీనం తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో ఆయన సమావేశాన్ని ఏర్పాటు చేశవారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ డోర్‌డెలివరీ వాహనాలను రద్దు చేసిన కారణంగా చౌకదుకాణాల డీలర్లు అందరూ రేషన్ ఇచ్చే రోజులలో సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్క డీలర్ తమ చౌకదుకాణాలలో 1వ తేదీ నుండి 15వ తేదీల వరకు రేషన్ పంపిణీ చేయాలని ఆయన సూచించారు. వృద్ధులకు, దివ్యాంగులకు వారి ఇంటి వద్దనే డీలర్లే రేషన్ పంపిణీ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సలాంబాషా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు నాయక్, చౌకదుకాణాల డీలర్లు పాల్గొన్నారు.

అంటరానితనాన్ని రూపుమాపాలి

మదనపల్లె రూరల్ : సమాజంలో అంటరానితనాన్ని రూపుమాపాలని తాలూకా ఎస్ఐ చంద్రమోహన్, మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ భరత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని మాలేపాడులో శనివారం తహసీల్దార్ ధనంజయులు ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రతి పౌరుడు తన హక్కులను వినియోగించుకోవడంతో పాటు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎన్. ఈశ్వరయ్యతో గాలి చంద్ర తదితరులు

రాజంపేట రూరల్ : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాలి చంద్ర కోరారు. స్థానిక బోయపాళెంలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నల్లబోతుల ఈశ్వరయ్యను శనివారం సీపీఐ రాష్ట్ర మాజీ నాయకుడు లక్ష్మీనారాయణ, గాలి చంద్ర కలిశారు. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ ప్రతీ కార్మికుడికి లెబర్ కార్డును అందించాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతీ కార్మికుడికి ఐదువేల పెన్షన్, సాధారణ మరణానికి ఆరు లక్షలు, ప్రమాదవశాత్తు రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలు

రాయచోటి : రాయచోటి వీరబల్లి మార్గంలోని దిగువ అబ్బవరం కాలనీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ రవీంద్ర (48) తీవ్రంగా గాయపడ్డారు. శనివారం రాత్రి విధి నిర్వహణలో భాగంగా రాయచోటి నుంచి వీరబల్లి పోలీస్ స్టేషన్కు వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రధాన రహదారిపైనే నిలిచిన ట్రాక్టర్‌ను గుర్తించకపోవడంతో ఈ ప్రమాదం సంబంధించినట్లు పోలీసులు తెలిపారు. తలకు హెల్మెట్ ఉన్నప్పటికీ రవీంద్ర తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం రాయచోటి ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

అడుగుకో గుంత.. ఆదమరిస్తే అంతే..


వర్షపు నీటితో మడుగును తలపిస్తున్న వడ్డపల్లె-పొత్రెడ్డిగారిపల్లె రోడ్డు


గుంతలమయంగా నాయనవారిపల్లె రోడ్డు

సంబేపల్లె : అడుగు అడుగుకో గుంత.. ఆదమరిస్తే అంతే సంగతులు.. వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది.

మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో లింకు రోడ్లు, తారు రోడ్లు గుంతలు ఏర్పడటంతో రాకపోకలు సాగించాలంటే వాహనదారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. దేవపట్ల నుంచి వంకవారిపల్లె, దిగవ రాజువారిపల్లె, హరిజనవాడ మీదుగా చిన్నబిడికి వరకు వెళ్లే రోడ్డుపై కంకర పరిచి దాదాపు పది నెలలు దాటింది. ఇప్పటివరకు పూర్తి కాకపోవడంతో ఈ రోడ్డుపై ప్రయాణం నరకంగా మారిందని వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు. అలాగే వడ్డపల్లె నుంచి నాయనవారిపల్లె వరకు నిత్యం ఆటోలు, ద్విచక్రవానదారులు ప్రయాణం సాగిస్తుంటారు. నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ రోడ్డు చాలా కాలంగా ఇట్లాగే ఉంది. వర్షం వస్తే ఇది నీటితో నిండిపోతుంది. వాహనదారులు గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారని సమీప గ్రామస్తులు తెలిపారు. ఇక్కడ ఒక్కచోటే కాదు.. రహదారి పొడవునా ఇదే పరిస్థితి ఉంది. రోడ్లపై ప్రయాణించే వాహనదారులకు నడుం నొప్పులు, ఇతరత్రా అనారోగ్య సమస్యల బారిన పడుతున్నామని, అంతేకాక వాహనాలు కూడా టైర్లు దెబ్బతినడం, తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని పలువురు వాహనదారులు వాపోతున్నారు. అయితే అధ్వానంగా ఉన్న ఆ రోడ్లపై వచ్చే క్రమంలో రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు ప్రయాణం సురక్షితంగా జరిగేలా గుంతలు పూడ్చి కనీస మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడి

ఓబులవారిపల్లె : ఆధునిక పద్ధతులతో వ్యవసాయం చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని డాక్టర్ ఎంఏ ఖురేషి పేర్కొనారు. శనివారం ముక్కావారిపల్లి, కొర్లకుంట గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఖురేషి మాట్లాడుతూ భూసార పరీక్షలు ద్వారా నూనె గింజల పంటలు సాగు చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. నూనె గింజల పరిశోధన సంస్థ హైదరాబాదు ప్రధాన శాస్త్రవేత్త భరత్ మాట్లాడుతూ నూనె గింజలు సాగు, చీడపీడల నివారణ తదితర అంశాలు గురించి రైతులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో ఉద్యానకళాశాల ప్రొఫెసర్ డాక్టర్ శివప్రసాద్, అనంతరాజుపేట ఉద్యాన కళాశాల అధ్యాపకులు ప్రొఫెసర్ వెంకట సుబ్బయ్య, రైతులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లీ కరుణించు


పూజలు అందుకుంటున్న ఎల్లమ్మతల్లి

వీరబల్లి : ఎల్లమ్మ తల్లీ కరుణించమ్మా.. అంటూ భక్తుల వేడుకున్నారు. మండలంలోని గడికోట కస్పాలో వెలసిన రేణుకా ఎల్లమ్మ దేవతకు శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకం, హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలు రాజంపేట మండలం , ఎగువ మందపల్లికి చెందిన రామన్నగారి వెంకట నాగేశ్వర కుటుంబ సభ్యులు నిర్వహించారు. ప్రతి ఏటా అమ్మవారికి పూజలు, అభిషేకాలు, బోనాలు సమర్పించడం ఆనవాయితీ వస్తోంది. మొక్కుబడి ఉన్నవారు చాందినీబండ్లు కట్టి అమ్మవారి ఆలయం చుట్టూ తిప్పి తమ మొక్కులు తీర్చుకున్నారు.

ఎల్లమ్మకు పాలదుత్తలు సమర్పణ

మండలంలోని వంగిమల్ల పెద్దూరు కస్పాలో ఎల్లమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రెండోరోజు శనివారం అమ్మవారికి కావిలిగడ్డ యాదవులు పాల దుత్తలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

ఏఎస్ఐ మృతికి సంతాపం


బుక్కే పురుషోత్తం నాయక్ (ఫైల్)

రాయచోటి టౌన్ : రాయచోటిలో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న బుక్కే పురుషోత్తం నాయక్ మృతి పట్ల వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన పోలీస్ శాఖకు చేసిన సేవలను కొనియాడారు. ఈ విషాద సమయంలో ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.